ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 22.06.2026 సమయం:13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొద్దిసేపటి క్రితం న్యూఢిల్లీలోని కర్తవ్య భవన్-2లో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తో సమావేశమయ్యారు.

2. మూడేళ్లలో పెట్రోల్, ఎరువుల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించనున్నామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

3. భూపాలపల్లి డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ ఆఫీసర్ వెంకన్న మృతి చెందిన సంఘటనపై సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.

4. రాష్ట్రంలో ఈరోజు నుంచి ఈనెల 27వ తేదీ వరకు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణశాఖ సూచించింది.

------------------------------

**రేవంత్ రెడ్డి – రాజ్ నాథ్ సింగ్**

రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూములు బదలాయించినందుకు కేంద్ర మంత్రికి రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి సంబంధించి భూ సేకరణ, యుటిలిటీస్ బదలాయింపు వంటి అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి తెలిపారు. దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశమైనందున రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని విధాలా సహాయసహకారాలు అందిస్తామని తెలిపారు.

మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీపంలో డీఆర్‌డీవో/డీఆర్‌డీఎల్ ఎంచుకున్న ప్రదేశంలో కీలకమైన ప్రాజెక్ట్‌ను త్వరగా మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

**డెస్క్**

------------------------------

**కిషన్ రెడ్డి**

మూడేళ్లలో పెట్రోల్, ఎరువుల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించనున్నామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. దేశంలో భారీగా బొగ్గు నిల్వలు ఉండటంతో కోల్ గ్యాసిఫికేషన్ ద్వారా మెథనాల్, ఇథనాల్, పెట్రోలు, ఫెర్టిలైజర్స్ ఉత్పత్తి చేయనున్నామని చెన్నైలో చెప్పారు. ఆ దిశగా దేశంలో పలు చోట్ల గ్యాసిఫికేషన్ కంపెనీలు నెలకొల్పనున్నామని తెలిపారు. రెండ్రోజుల క్రితం ఒడిశాలో కోల్ ఇండియా సంస్థ సహకారంతో కోల్ గ్యాసిఫికేషన్ కంపెనీకి భూమి పూజలు జరిగాయని పేర్కొన్నారు. దీనికి కొనసాగింపుగానే 46 వేల కోట్ల రూపాయల ప్రోత్సాహక నిధులతో 50 కోల్ గ్యాసిఫికేషన్ కంపెనీలు నెలకొల్పాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. ఇతర దేశాలపై ఆధారపడడం వల్ల సరఫరా తగ్గినప్పుడల్లా, దేశంలో పెట్రోలు, ఎరువుల కొరత ఏర్పడుతోందన్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. 2029 లోగా పెట్రోలు, ఎరువుల విషయంలో భారత్ స్వయం సమృద్ధిని సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**డెస్క్**

--------------------------------

**ముఖ్యమంత్రి రిపోర్ట్**

భూపాలపల్లి డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ ఆఫీసర్ వెంకన్న ఇసుక లారీ ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వెంకన్న కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సంఘటన పై సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని  జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్ ను ముఖ్యమంత్రి ఆదేశించారు.

డెస్క్

--------------------------------

**మహేష్ కుమార్ గౌడ్**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అపాయింట్‌మెంట్ ఇప్పిస్తే తాము వెళ్లి బీజేపీ గత మూడు లోక్‌సభ ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై అడుగుతామని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ ఇప్పించాలంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ముఖ్యమంత్రికి లేఖ రాయడంపై మహేశ్‌కుమార్‌గౌడ్ స్పందించారు. ముందు తాము మోదీని కలిసేందుకు సమయం ఇప్పిస్తే.. ఆ తరువాత రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ ఇచ్చే విషయం మాట్లాడుకుందామన్నారు. ఈ నెల 25 నుంచి ఆదివాసీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టనున్న బస్సు యాత్ర ప్రచార గోడపత్రికను గాంధీభవన్‌లో ఏఐసీసీ తెలంగాణ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ఎంపీ మల్లు రవిలతో కలిసి ఆయన ఆవిష్కరించారు.

డెస్క్

--------------------------------

**అవార్డు**

గ్రామాలకు నాణ్యమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలను అందించడంతో పాటు, ఈ-గవర్నెన్స్ సేవలకు బలమైన డిజిటల్ మౌలిక వసతులు కల్పించడంలో చేసిన కృషిని గుర్తిస్తూ.. ‘తెలంగాణ ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్’ కు ప్రతిష్ఠాత్మక స్కోచ్ అవార్డు-2026 దక్కింది. ఈ మేరకు న్యూఢిల్లీలో ‘వికసిత్ భారత్ కోసం నియంత్రణ చట్రం’ అనే అంశంపై నిర్వహించిన 108వ స్కోచ్ సదస్సులో టీ-ఫైబర్ ఎండీ వేణుప్రసాద్ ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో నాణ్యమైన డిజిటల్ సేవలను అందించే దిశగా చర్యలను వేగవంతం చేయాలని టీ-ఫైబర్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని గృహాలు, ప్రభుత్వ సంస్థలకు టీ-ఫైబర్ సేవలను ప్రాధాన్యతా క్రమంలో విస్తరించాలని సంస్థ ఎండీకి సూచించారు.

డెస్క్

--------------------------------

**నివేదిక**

రాష్ట్రంలో మొత్తం పనిచేస్తున్న కార్మికుల్లో వ్యవసాయేతర రంగాల్లోనే దాదాపు 90.44 శాతం మంది ఉన్నట్లు కేంద్ర గణాంక శాఖ '6వ ఎకనామిక్ సెన్సెస్' గణాంకాల నివేదిక వెల్లడించింది. దేశవ్యాప్తంగా ఈ రంగాల్లో అత్యధికంగా ఉపాధి కల్పిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ పదో స్థానంలో నిలిచింది. గ్రామీణ ప్రాంతాల్లోనూ వ్యవసాయ ఆధారిత రంగాల్లో ఉపాధి తగ్గుతోందని నివేదిక వెల్లడించింది. గ్రామాల్లోనూ పలు సంస్థలు దుకాణాలు, చిన్న తరహా పరిశ్రమలు, హోటళ్ల వంటి వ్యవసాయేతర విభాగాల్లోకి వస్తున్నాయని తెలిపింది.

**డెస్క్**

--------------------------------

**డీకే అరుణ**

గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల నిధులను సమర్ధవంతంగా వినియోగిస్తూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ తెలిపారు. హన్వాడ మండలం వెంకటమ్మకుంట తాండాలో MGNREGS 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ఎంపీ ప్రారంభించారు.

**పీటీసీ – మహబూబ్ నగర్**

--------------------------------

**కిసాస్ సమ్మాస్ నిధి యోజన**

కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన డబ్బులు రైతుల అకౌంట్లో జమ చేయబడుతున్నాయని కరీంనగర్ జిల్లా వ్యవసాయ అధికారిని భాగ్యలక్ష్మి ఆకాశవాణితో మాట్లాడుతూ తెలిపారు.

**పీటీసీ - కరీంనగర్**

----------------------------------

**లోక్ అదాలత్**

ప్రత్యేక లోక్‌అదాలత్ ద్వారా 6వేల 303 మంది సైబర్ మోసం బాధితులకు 45 కోట్ల రూపాయలకు పైగా రిఫండ్ చేసినట్లు తెలంగాణ పోలీసులు తెలిపారు. సైబరాబాద్ కమిషనరేట్‌లో 2వేల 232 మందికి చెందిన సుమారు 22 కోట్ల రూపాయలు, సైబర్ సెక్యూరిటీ బ్యూరో పరిధిలో 77 మందికి 6 కోట్ల 83 లక్షల రూపాయలు రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. మల్కాజిగిరి, హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాలు రికవరీలో అగ్రస్థానంలో నిలిచాయన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటు నుంచి ఇప్పటివరకు 59వేల 953 మంది బాధితులకు 445 కోట్ల రూపాయలకు పైగా రిఫండ్ అయినట్లు తెలిపారు.

**డెస్క్**

-----------------------------------------

**సబ్ కమిటీ**

వీబీజీ రామ్‌జీ చట్టం పై తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ తొలి సమావేశం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. మంత్రులు డాక్టర్ దనసరి అనసూయ సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, డాక్టర్ వివేక్ వెంకటస్వామి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం, వ్యవసాయ రంగం, స్థానిక సంస్థలపై కొత్త చట్టం ప్రభావాలను సమీక్షించారు. 60 రోజుల ఉపాధి విరామం అమలు సాధ్యం కాదని, రాష్ట్రాలపై 40 శాతం నిధుల భారం మోపడం సహకార సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని అభిప్రాయపడ్డారు.

**డెస్క్**

-------------------------------------------

**భట్టి**

ఒలింపిక్స్ లక్ష్యంగా తెలంగాణలో అంతర్జాతీయ ప్రమాణాలతో స్పోర్ట్స్ యూనివర్సిటీని త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. ఉప్పల్ స్టేడియంలో టీజీ-20 క్రికెట్ లీగ్ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభను గుర్తించి ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. జిల్లాల వారీగా

క్రీడాకారులను ఎంపిక చేసి యువతకు అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. 21 రోజుల టీజీ-20 టోర్నీకి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని భట్టి విక్రమార్క తెలిపారు.

**డెస్క్**

-------------------------------

**కేసులు**

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ లో  భాగంగా 279 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. 228 ద్విచక్ర వాహనదారులు, 8 ఆటోలు, 43 కార్ల డ్రైవర్లపై కేసులు నమోదయ్యాయి. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ లో 331 మంది ద్విచక్ర వాహనదారులు, 16 మంది త్రీ-వీలర్ ఆటో డ్రైవర్లు, 46 మంది ఫోర్-వీలర్ కార్ డ్రైవర్లు, ఇద్దరు ఇతర వాహనదారులు పట్టుబడ్డారు.

**పీఎస్**

-----------------------------------

**ప్రపంచ వర్షారణ్య దినోత్సవం**

ఈరోజు ప్రపంచ వర్షారణ్య దినోత్సవం జరుపుకుంటున్నారు. వర్షారణ్యాల ప్రాముఖ్యతను తెలియజేయడానికి, వాటి పరిరక్షణకు అవసరమైన చర్యలను ప్రోత్సహించడానికి దీనిని జరుపుకుంటారు.  భూమిపై ఉష్ణోగ్రతలను స్థిరంగా ఉంచడంలో, ప్రపంచవ్యాప్తంగా వర్షపాతాన్ని శాసించడంలో వర్షారణ్యాలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. ప్రపంచానికి అవసరమైన ప్రాణవాయువు ఆక్సిజన్ లో దాదాపు 20 శాతం ఈ వర్షారణ్యాల నుంచే అందుతుంది.  భూమిపై ఉన్న మొత్తం మొక్కలు, జంతు జాతులలో సగానికి పైగా వర్షారణ్యాలలోనే నివసిస్తున్నాయి. మిలియన్ల కొద్దీ స్థానిక గిరిజన తెగలకు ఆవాసంగా ఉంటూ, జీవనాధారాన్ని అందిస్తున్నాయి.

**జీఎస్**

------------------------------------

**పొన్నం సంతాపం**

భూపాలపల్లి జరిగిన రోడ్డు ప్రమాదంలో విధినిర్వహణ లో ఉన్న మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ వెంకన్న మృతి పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వెంకన్న భూపాలపల్లి రవాణా శాఖ కార్యాలయం వద్ద వాహనాల తనిఖీలు చేస్తున్న సమయంలో టిప్పర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు వెల్లడించారు. ప్రమాద ఘటనపై మంత్రి పొన్నం ప్రభాకర్ విచారణకు ఆదేశించారు. వెంకన్న మృతి పట్ల సంతాపాన్ని వ్యక్తం చేశారు.

**డెస్క్**

------------------------------

**జూపల్లి**

కేంద్ర ప్రభుత్వ స్వదేశ్ దర్శన్ 2.0 పథకం కింద 56కోట్ల రూపాయలకు పైగా వ్యయంతో భువనగిరి కోటను ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా సుమారు 18 కోట్ల రూపాయలతో 1,020 మీటర్ల పొడవైన రోప్‌వే ఏర్పాటు చేసి గంటకు 250 నుంచి 300 మంది ప్రయాణికులు ప్రయాణించే సౌకర్యం కల్పిస్తారు. మరో 39 కోట్ల రూపాయలతో రహదారులు, పార్కింగ్, ఈ-వాహనాలు, కేఫెటేరియా, వ్యూయింగ్ గ్యాలరీ, టాయిలెట్లు, ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్, వారసత్వ కట్టడాల పునరుద్ధరణ చేపడతారు. కాగా, భువనగిరి కోట అభివృద్ధి పనులను ఈరోజు పరిశీలించిన మంత్రి జూపల్లి కృష్ణారావు, పనుల్లో జాప్యంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ అక్టోబర్ 2 నాటికి అన్ని పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**డెస్క్**

---------------------------------------

**గుత్తా సుఖేందర్ రెడ్డి**

రాజకీయాల్లో పోటీచేసే వారి ఖర్చు ఎంత పెరుగుతుందో, అవినీతి కూడా అంతే స్థాయిలో పెరుగుతుందని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. అధికారుల్లో అవినీతి ఆందోళనకర స్థాయిలో పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. నల్లగొండలో జరిగిన మీడియా చిట్ చాట్ లో ఆయన మాట్లాడారు.

**పీటీసీ - నల్గొండ**

--------------------------------------

**వాతావరణం**

రాష్ట్రంలో ఈరోజు నుంచి ఈనెల 27వ తేదీ వరకు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణశాఖ సూచించింది. ఈరోజు మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మహబూబాబాద్, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీగా వర్షం కురవనుందని వెల్లడించింది. ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో పలుచోట్ల వడగాలులు వీచే అవకాశాలు ఉన్నట్లు పేర్కొంది.

**డెస్క్**

----------------------------------